భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన


బొడ్రాయిని ప్రతిష్టిస్తున్న వేదపండితులు


యాగశాలలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

దహెగాం మండల కేంద్రంలో పోచమాంబ శీతలాదేవి, నవగ్రహ సహిత సంతాన నాగేంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం విగ్రహాల ప్రతిష్టాపన నిర్వహించారు. విగ్రహాలను భాజాభజంత్రీలతో భూలక్ష్మి, పోచమ్మ ఆలయం వరకు ఊరేగించారు. శివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితులు దుద్దిళ్ల మనోహర అవధాని, పార్థివ శర్మ, పరమేశ్వర్‌ల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఉదయం 8.10 గంటలకు నవగ్రహ, బొడ్రాయి, పోచమాంబ శీతలాదేవిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు పోచమాంబ తొలిదర్శనం చేసుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురువారం ఉదయం పోచమ్మ బోనాల కార్యక్రమం నిర్వహించనున్నారు.

– దహెగాం


పోచమాంబ తొలి దర్శనం కోసం వెళ్తున్న భక్తులు


శివాలయంలో నవగ్రహాల ప్రతిష్టాపన


విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

క్లుప్తంగా

'ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తాం'


పూజలు చేస్తున్న పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల: సీఎం కేసీఆర్ పరిపాలనలో నిర్లక్ష్యానికి గురైన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును బీజేపీ ప్రభుత్వంలో తుమ్మిడిహెట్టి వద్ద నిర్మిస్తామని బీజేపీ నేత పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి –గడపగడపకు బీజేపీ పాదయాత్ర బుధవారం 22వ రోజు మండలంలోని తుమ్మిడిహెట్టి, జనగాం, పీపీనగర్, గుండాయిపేట్, వీర్దండి గ్రామాల్లో కొనసాగింది. ఆయన ప్రాణహిత నదివద్ద ప్రత్యేక పూజలు చేశారు. గత ప్రభుత్వాలు నిర్మించిన నియోజకవర్గంలోని 17 ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా ఉన్నాయని ఆరోపించారు. సాగు నీరు అందించకుండా సాగు భూములను బీడు భూములుగా మార్చిన ఘనత ఎమ్మెల్యే కోనేరు కోనప్పకే దక్కుతుందని విమర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు వానుపటేల్, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, నాయకులు బండి రాజేందర్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, విజయ్, మధుకర్, తిరుపతి, గంగారం, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్య సాధన సులువు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెంకటరమణ

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సులువని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి పి.వెంకటరమణ అన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సార్వత్రిక విశ్వవిద్యాలయం పరీక్షా కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ తర్వాత విద్యార్థులు ఉన్నత చదువులతో జీవితంలో స్థిరపడేలా ముందుకు సాగాలని సూచించారు. ఫలితాలను త్వరగా ప్రకటిస్తామని పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ టి.దత్తాత్రేయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖలీల్ పాషా సేవలు అభినందనీయం


సన్మానిస్తున్న డిపో మేనేజర్ శ్రీధర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న ఖలీల్ పాషా సంస్థకు చేసిన సేవలు ఎంతో అభినందనీయమని డిపో మేనేజర్ శ్రీధర్ కొనియాడారు. బుధవారం ఖలీల్ పాషా పదవీ విరమణ కార్యక్రమ ంలో ఆయన మాట్లాడారు. ఖలీల్ పాషా విధులపై అంకిత భావంతో పని చేసి సంస్థకు లాభం వచ్చే విధంగా కృషి చేశారన్నారు. అనంతరం ఖలీల్ పాషా ను పూలమాలలు, శాలువతో ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉదయ్, ఇంతియాజ్, అహ్మద్, రహమాన్, హబీబ్, జహీర్, రసూల్, బాబు త్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం


బాధితులతో మాట్లాడుతున్న కోవ లక్ష్మి

రెబ్బెన: అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని గోలేటి విలేజ్‌కి చెందిన గుగులోత్ శంకర్‌తో పాటు అతని సోదరుడికి చెందిన ఇళ్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కాగా బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి గోలేటి విలేజ్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలతో పాటు జరిగిన ఆస్తినష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శంకర్, రవినాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు బాబుగౌడ్, సంతోశ్, శ్యామ్, ఆశిష్ పాల్గొన్నారు.

జిల్లాలో '30 పోలీస్‌యాక్ట్' పొడిగింపు


మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా ప్రశాంతతను పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న 30 పోలీసు యాక్ట్ 1861ని ఈనెల 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.సురేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి, పోలీసు ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'యువత సన్మార్గంలో నడవాలి'

కాగజ్‌నగర్‌రూరల్: యువత సన్మార్గంలో నడవాలని కాగజ్‌నగర్‌రూరల్ సీఐ నాగరాజు అన్నారు. మండలంలోని గన్నారం గ్రామంలో బుధవారం పోలీసులు మీకోసంలో భాగంగా పేదలకు నిత్యావసర సరుకులు, యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దన్నారు. అసాంఘిక కార్యక్రమాలు గ్రామంలో జరిగితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజ్‌గాం ఎస్సై జగదీశ్, సిబ్బంది నయీం, శంకర్ పాల్గొన్నారు.

ఇరుకు గదుల్లోనే 'పల్లె పాలన'

- ముందడుగు పడని పంచాయతీ భవనాల నిర్మాణం
- ఒక్కో భవనానికి రూ.20 లక్షల కేటాయింపు
- నిర్మాణ పనులపై ఆసక్తి చూపని సర్పంచులు



రాంపూర్‌లో ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ

రెబ్బెన: పల్లెల్లోని గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేక పాలకవర్గాలతో పాటు ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. చెట్ల కింద, ప్రభుత్వ పాఠశాలల భవనాల్లో పల్లె పాలన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామసభలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త గ్రామ పంచాయతీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరు చేసింది. కానీ నెలలు గడుస్తున్నా పక్కా భవనాల నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. భవనాలు మంజూరైన కొన్ని పంచాయతీల్లో స్థలం కొరత సమస్యగా మారగా మరికొన్ని పంచాయతీల్లో పనులు చేపట్టేందుకు సర్పంచులు ముందుకు రావడం లేదు.

ఏడు పంచాయతీలకు భవనాలు మంజూరు..

రెబ్బెన మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా వాటిలో 12 కొత్తగా ఏర్పడ్డాయి. వీటిలో పంచాయతీ కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల పాత భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ పాత భవనాల్లో ఏర్పాటు చేశారు. అవి కూడ అందుబాటులో లేని పంచాయతీల్లో అద్దె భవనాల్లో ఏర్పాటు చేసి పల్లెపాలన కొనసాగిస్తున్నారు. పక్కా భవనాల నిర్మాణం కోసం జనవరిలో మండలంలోని ధర్మారం, జక్కులపెల్లి, కైరిగాం, కొమురవెల్లి, మాద్వాయిగూడ, పులికుంట, రాంపూర్ పంచాయతీలకు ఈజీఎస్‌లో భాగంగా పక్కా భవనాలు మంజూరు చేసింది. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.20లక్షలు కేటాయించింది. భవనాలు మంజూరై నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు.

ఇరుకు భవనాలతో ఇబ్బందులు

మండలంలోని చాలా పంచాయతీలకు పక్కా భవనాలు లేక ఇరుకు భవనాలతో కాలం వెళ్లదీస్తున్నారు. అద్దె భవనాలు, ఖాళీ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యాలయాల్లో సౌకర్యాలు లేక మహిళా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. కొన్ని పంచాయతీల్లో కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడ లేదు. రికార్డు రూం, స్టోర్‌రూంలు లేకపోవటంతో పంచాయతీకి అవసరమైన సామగ్రిని భద్రపర్చేందుకు సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

ముందుకు రాని సర్పంచులు

గ్రామ పంచాయతీ పక్కా భవనాల బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీలకు అప్పగించింది. పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా ఆయా పంచాయతీ సర్పంచులు నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. కొన్ని పంచాయతీల్లో భవనం నిర్మాణానికి కావాల్సిన స్థలం అందుబాటులో లేక నిర్మాణ పనులు ప్రారంభం కావడం లేదు. స్థలం అందుబాటులో ఉన్న పంచాయతీల్లో నిర్మాణ పనులు చేపట్టేందుకు సర్పంచులు ముందుకు రావడం లేదు. పదవీ కాలం చివరి దశలో ఉండగా నిర్మాణాలు చేపడితే బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని జంకుతున్నారు. దానికి తోడూ ఈజీఎస్ నిధులు కావటంతో బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి.

పనులు ప్రారంభించేలా చర్యలు

మండలంలో ఏడు గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. వాటిలో 6 కొత్తగా ఏర్పడిన పంచాయతీలు కాగా ఒకటి పాత గ్రామ పంచాయతీ. కొన్ని పంచాయతీల్లో స్థలం సమస్యగా ఉండగా మిగిలిన పంచాయతీల్లో నిర్మాణ పనులు చేపట్టేందుకు సర్పంచులు ముందుకు రావడం లేదు. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– సుహాస్, ఏఈఈ పంచాయతీ రాజ్

భక్తిశ్రద్ధలతో ఉర్సు


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప



ఖవ్వాలీ పాడుతున్న గాయకురాలు


దర్గా ప్రాంగణంలో భక్తులు


ఖవ్వాలీ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణారావు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని డొనల్ ప్రాంతంలో గల సయ్యద్ తాలిబ్ అలీషా బాబా దర్గాలో ఉర్సు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన ఉత్సవాలు గురువారం ఉదయం ముగియనున్నాయి. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఉర్సు కమిటీ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో ప్రముఖ గాయకులతో రెండు రోజుల పాటు ఖవ్వాలీ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి 11.30 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగింది. ఉర్సు ఉత్సవాలకు కౌటాల, బెజ్జూర్, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల్లోని ప్రజలతో పాటు మంచిర్యాల, కరీంనగర్, మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాల్లోని భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు కాగజ్‌నగర్ పట్టణం నుంచి దర్గా ప్రాంగణం వరకు కాలినడకతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌటాల సీఐ సాదిక్ పాషా, సిర్పూర్(టి) ఎస్సై రమేశ్‌ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలకు జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మండల ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరయ్యారు.

ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే కోనప్ప..

ఉర్సు ఉత్సవాలకు బుధవారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు ఉత్సవాల నిర్వహణ, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఉపసర్పంచ్ తోట మహేష్, నాయకులు అఖిల్ అహ్మద్, ఇఫాత్‌హుస్సేన్, నాని పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ అవగాహన ర్యాలీ


పెంచికల్‌పేట్: ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది


కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం ప్రారంభించారు. వైద్యఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: అంతర్జాతీయ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ పొగాకు వినియోగంతో అనారోగ్యం బారిన పడతారన్నారు. పొగాకుకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకమైన జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధ విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

బెజ్జూర్: సిర్పూర్(టి) మండలంలోని నాగమ్మ చెరువులో ఈనెల 4న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బుద్ధ విగ్రహావిష్కరణకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని బుద్ధ సమాజ్ తాలూకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బుద్ధ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బెజ్జూర్ మండలానికి చెందిన బుద్ధ సమాజ్ ఉపాసక్, ఉపాసికలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు దుర్గం శ్యాంరావు, మండల అధ్యక్షుడు కుమ్మరి పోషన్న, సభ్యులు చునార్కార్ భాస్కర్, భక్తు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి


కెరమెరి: మాట్లాడుతున్న శ్రీనివాస్

కెరమెరి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను పండుగలా జరుకోవాలని అదనపు డీఆర్డీవో, కెరమెరి ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏడీఏ వెంకట్, జెడ్పీటీసీ దుర్పతబాయితో కలిసి ఎంపీపీ పెందోర్ మోతీరాం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 2 నుంచి 22 వరకు రోజువారీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, తహసీల్దార్ జమీర్, ఎంపీవో సుదర్శన్, ఎంఏవో గోపీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరావు, ఏఈవో వెంకటేశ్, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్, ఈసీ ఐక్యనాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతువేదికలో పనుల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కోసం రైతువేదికలు ముస్తాబవుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలోని రైతువేదికలో నిర్వహిస్తున్న పనులను బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్ పరిశీలించారు. రైతువేదికల చుట్టూ ఉన్న చెత్తాచెదారం తొలగించే పనులను ఆయన పరిశీలించారు. ఈనెల 3న రైతువేదికల్లో సమావేశాలు నిర్వహించి రైతుసంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తామన్నారు. సమావేశాలకు రైతులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

కెరమెరి: మండలంలోని కెస్లాగూడ గ్రామంలో ఉన్న రైతువేదికను బుధవారం ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ పరిశీలించారు. జూన్ 2 నుంచి 22 వరకు కొనసాగే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాలు నిర్వహించేందుకు రైతువేదికలను వినియోగించుకోవాలన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

కౌటాల: వీవోఏల డిమాండ్లు నెరవేర్చాలని వీవోఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు అన్నారు. మండల కేంద్రంలో వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 45వ రోజు బుధవారం కొనసాగింది.